# హర్యాలి మార్గదర్శక సూత్రాలపై
# శిక్షణ నమూనా

## పాల్గొనువారు: గ్రామ ప్రజా ప్రతినిధులు



రూపకల్పన: వాసన్


**వాసన్**

**వాటర్‌షెడ్ సపోర్ట్ సర్వీసెస్ అండ్ యాక్టివిటీస్ నెట్‌వర్క్**

12-13-452, వీధి నెం.1, తార్నాక, సికింద్రాబాదు- 500 017

ఫోన్: 27015 295/27015296

## హర్యాలి మార్గదర్శక సూత్రాలపై పంచాయితీ ప్రతినిధులకు శిక్షణ నమూనా

లక్ష్యం: హర్యాలి మార్గదర్శక సూత్రాలలో వాటర్‌షెడ్ కార్యక్రమంలో పంచాయితీల ప్రాధాన్యత గురించి తెలియచేయటం

**నేర్చుకునే ఉద్దేశాలు:**

1 వాటర్‌షెడ్ కార్యక్రమ ఉద్దేశాలు గురించి తెలుసుకుంటారు.
2 గ్రామ పంచాయితీ కమిటీల గురించి తెలుసుకుంటారు.
3 వాటర్‌షెడ్‌లో బృందాల గురించి తెలుసుకుంటారు
4 వాటర్‌షెడ్‌లో ప్రక్రియలు, ప్రాధాన్యతలు, దశలపై అవగాహన
5 హరియాలి మార్గదర్శక సూత్రాల ప్రకారం పంచాయితీ పాత్ర గురించి తెలుసుకుంటారు
6 వాటర్‌షెడ్ కార్యక్రమంలో వ్యక్తుల బాధ్యతలు గురించి తెలుసుకుంటారు.

**విషయాలు:**

1 పరిచయాలు, శిక్షణ బాధ్యతలు
2 వాటర్‌షెడ్ అంటే ఏమిటి?
3 హరియాలి మార్గదర్శక సూత్రాల పరిచయం
4 గ్రామ పంచాయితీ - కమిటీ ఏర్పాటు చేసే పనులు
5 సహజ వనరుల కమిటీ బాధ్యతలు
6 సహజ వనరుల సమస్యల విశ్లేషణ
7 ఏరువాక చిత్ర ప్రదర్శన
8 వాటర్‌షెడ్‌లో బృందాలు
9 వాటర్‌షెడ్ కార్యక్రమంలో ప్రక్రియలు, దశలు
10 వాటర్‌షెడ్ కార్యక్రమంలో ప్రాధాన్యతలు
11 హరియాలి గైడ్‌లైన్స్ ప్రకారం పంచాయితీ పాత్ర
12 వాటర్‌షెడ్‌లో వ్యక్తులు , బాధ్యతలు

**మొదటిరోజు**

## సెషన్ -1

**విషయం: పరిచయాలు**

**ఉద్దేశం: స్నేహపూరిత వాతావరణ ఏర్పడటం, శిక్షణలో చురుకుగా పాల్గొనేలా చేయటం**

**పద్ధతి: నంబరింగ్ ఆట**

**సమయం: 30 నిమిషాలు**

**కావలసిన మెటీరియల్: ఏమి అవసరం లేదు**

**ఆట ఆడించే పద్ధతి:** ఫెసిలిటేటర్ మధ్యలో నిలబడి గ్రూపు సభ్యులను గుండ్రంగా తిరగమని చెప్పాలి. సభ్యులు తిరుగుతున్నప్పుడు 5, 4 లేక ఏదైన ఒక సంఖ్య చెప్పి ఆ సంఖ్య ఎంతైతే అంతమందిని ఒక గ్రూపుగా ఏర్పడాలి అలా 4 లేక 5 రౌండ్లు తిప్పాలి. ప్రతి రౌండులో సభ్యులను కలిసిన వారిని కలవకుండా కలుసుకోవాలి. మిక్స్‌డు గ్రూపు అయితే ప్రతి గ్రూపులో మహిళలు, పురుషులు ఉండాలి అని చెప్పాలి. ప్రతి రౌండులో సభ్యులు (గ్రూపుగా ఏర్పడిన తరువాత సభ్యులను పేరు, పూరు చెప్పి పరిచయం చేసుకొమ్మని వారు మాట్లాడుకోవటానికి ఏదైన ఒక చిన్న టాస్క్ ఇవ్వాలి. ఉదా: వాళ్ళ కుటుంబాలు గురించి దూర ప్రయాణం చేసి వస్తే ప్రయాణంలో అనుభవాలు, వారికి ఇష్టమైన వ్యక్తులు, అలవాట్లు గురించి మొదలైనవి ప్రతి రౌండుకి 3నుండి 5 నిమిషాలు సమయం కేటాయించి 5రౌండ్లు తిప్పి ఆడించాలి.
ఆట ముగిసిన తరువాత అందర్ని వారి వారి స్థలాలలో కూర్చోమని రివ్యూ చేయాలి.

### రివ్యూలో అడగవలసిన ప్రశ్నలు:

1 ఈ ఆట ద్వారా మీలో ఎలాంటి భావనలు కలిగాయి?
2 ఈ ఆట ఎందుకు ఉపయోగపడుతుంది?

### ఫెసిలిటేటర్ సూచనలు:

- ఫెసిలిటేటర్ రివ్యూలో అందరు పాల్గొనేటట్లు చూడాలి
- ఎవరైనా చెప్పకపోతే బలవంతంగా చెప్పించకూడదు
- ఆట ఉద్దేశం తెలియచేసి శిక్షణా కార్యక్రమ ఉద్దేశాలు తెలియచేయాలి
- పైన పేర్కొనబడిన శిక్షణా కార్యక్రమ ఉద్దేశాలు తెలియచేయాలి
- ఫెసిలిటేటర్ శిక్షణకు సంబంధించి టైంటేబుల్, నియమాలు, బాధ్యతలు సభ్యులను అడుగుతూ ఏర్పాటు చేయాలి.

### నియమాలు:

ఉదా: అందరూ సమయం పాటించాలి, ఆలస్యంగా వస్తే ఒక పాట పాడాలి. ఇంకా ఏమి నియమాలు ఉండాలి అని గ్రూపు సభ్యులను అడుగుతూ ఏర్పాటు చేయాలి.

### బాధ్యతలు: మోడరేటర్, రిపోర్టింగ్ టీం

ప్రతిరోజు గ్రూపుకు ఒక మోడరేటర్ ఉండాలి. ఎవరుంటారు అని అడుగుతూ మూడు రోజులకు ముగ్గురు మోడరేటర్లను నియమించాలి.

### మోడరేటర్ చేయాల్సిన పనులు:

- సభ్యులందరు సమయం పాటించేలా చూడాలి
- సెషన్ జరిగే సమయంలో అందరూ పాల్గొంటున్నారా లేదా చూడాలి
- సభ్యులందరికీ సమయం గుర్తు చేయాలి
- చిన్న చిన్న గ్రూపులు అంటే ఇద్దరిద్దరు గుసగుసగా మాట్లాడకుండా చూడాలి
- ప్రతిరోజు జరిగే చర్చలన్నింటిని రాయడానికి ఎవరుంటారు (ఇద్దరు చొప్పున ఉండాలి ని ఫెసిలిటేటర్ గ్రూపు సభ్యులను అడుగుతూ మూడు రోజులకు రిపోర్టింగ్ టీంని నియమించాలి.

### రిపోర్టింగ్ టీం బాధ్యత:

శిక్షణలో జరిగిన విషయాలన్నింటిని ఏ పద్ధతిలో చర్చించామో నేర్చుకున్న అంశాల గురించి నివేదిక రూపంలో రాసి ప్రజంట్ చేయాలి.

**ఫెసిలిటేటర్‌కు సూచనలు:**

1 నివేదిక సమర్పణ అనంతరం గ్రూపు సభ్యులను నివేదికపై ఫీడ్‌బాక్ ఇమ్మని చెప్పాలి

2 ఫెసిలిటేటర్ కూడా నివేదిక సమర్పించిన టీంకు ఫీడ్‌బ్యాక్ ఇవ్వాలి

3 వీటన్నిటిని ఒకసారి క్రోడీకరణ చేసి సెషన్ ముగించాలి.

## సెషన్ -2

**విషయం: వాటర్‌షెడ్ అనగా ఏమి?**

**సమయం: 30 నిమిషాలు**

**పద్ధతి: లెక్చర్, బ్రైన్ స్టోమింగ్**

**కావలసిన మెటీరియల్: బ్రౌన్‌షీట్లు, మార్కర్లు**

**ఫెసిలిటేటర్‌కి సూచనలు:**

1 వాటర్‌షెడ్ అనగా ఏమిటని సభ్యులను కొంతవరకు బ్రెయిన్ స్టోమింగ్ పద్ధతిలో వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకోవాలి.

2 సభ్యులందరు వారికి తెలిసిన అభిప్రాయాలు చెప్పేటట్లు ఫెసిలిటేటర్ అవకాశం ఇవ్వాలి.

3 సభ్యులు చెబుతున్న అభిప్రాయాలను బ్రౌన్‌షీట్ పై రాయాలి

4 వచ్చిన అభిప్రాయాలన్నింటిని సమీకరణ చేసి వాటర్‌షెడ్ అనగా ఏమిటి? ఎవరి కోసం అన్న విషయం తెలియచేయాలి.

**వాటర్‌షెడ్ అనగా:**

1 వాటర్‌షెడ్ అంటే నీటి పరివాహక ప్రాంతం. ఒక ప్రాంతంలో పడిన వర్షం నీరు ఎక్కడి నుండి బయటికి పోతుందో ఆ ప్రాంతాన్నంతా కలిపి వాటర్‌షెడ్ అంటారు.

2 వాటర్‌షెడ్ కార్యక్రమం కోసం సుమారు 500 హెక్టార్ల (1250 ఎకరాల) విస్తీర్ణం గల వాటర్‌షెడ్ ప్రాంతాన్ని ఒక యూనిట్‌గా తీసుకున్నారు. వాన చినుకుపడ్డ చోటు నుంచి చినుకులన్నీ కలిసి నీరు పారడం మొదలుకాగానే నేలకోత ప్రారంభమవుతుంది. కిందకు వెళ్లే కొద్దీ నీటి పరిమాణమూ, వేగమూ పెరుగుతుంది. భూమి కోత ఎక్కువవుతుంది. దానిని ఆపాలంటే నీటిచుక్క పడ్డ చోటునే దానిని అదుపుచేయాలి. అలా భూమి సారం నిలుస్తుంది. ప్రతి నీటి చుక్క సద్వినియోగమవుతుంది. పారే నీరుకు ఎక్కడెక్కడి నుంచి నీరు వచ్చి చేరుతుందో ఆ ప్రాంతమంతా వాటర్‌షెడ్‌గా గుర్తించేది అందుకోసమే.

**ముఖ్యమైన ప్రశ్నలు:**

1 వాటర్‌షెడ్ కార్యక్రమం ఎవరికి సంబంధించినది

2 పేదలు, మహిళలు వాటర్‌షెడ్ కార్యక్రమంలో ఏ విధంగా పాల్గొనేటట్లు చేయవచ్చు?

3 భూమి లేని వారికి వాటర్‌షెడ్ ఏ విధంగా ఉపయోగపడుతుంది

**జవాబులు:**

- వాటర్‌షెడ్ కార్యక్రమం ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడిన వారికి అనగా భూమి ఉన్న వారికి లేని వారికి ముఖ్యంగా పొదుపుకు సంబంధించిన కార్యక్రమం
- గ్రూపులుగా ఏర్పడి వాటర్‌షెడ్ కార్యక్రమంలో పనులు చేసుకోనుటకు
- పేదలు, మహిళలకు సంబంధించిన అంశాలను ప్రణాళికలో ప్రాధాన్యత ఇవ్వాలి
- వారికి నిర్ణయాధికారం కల్పించాలి
- భూమిలేని వారు ఏ వనరులపై పరోక్షంగా ఆధారపడుతున్నారో వాటి అభివృద్ధికి ప్రణాళిక చేయుట

**స్టాప్ అండ్ చెక్**

1 వాటర్‌షెడ్ కార్యక్రమం అంటే ఏమిటి?

2 ఎవరికి అన్న విషయం తెలుసుకున్నారా లేదా తెలుసుకొని సెషన్ ముగించాలి.

## సెషన్ -3

**విషయం: హర్యాలి మార్గదర్శక సూత్రాలు పరిచయం**

**సమయం: 30 నిమిషాలు**

**పద్ధతి: లెక్చర్**

**కావలసిన మెటీరియల్: హర్యాలి మార్గదర్శక సూత్రాలు వున్న నోట్**

**ఫెసిలిటేటర్‌కు సూచన:**

1 హర్యాలి మార్గదర్శక సూత్రాలు నోట్ బాగా చదవాలి

2 వాటర్‌షెడ్ కార్యక్రమంపై వచ్చిన మార్గదర్శక సూత్రాలను చదవాల్సిన అవసరం వుంది

**ఫెసిలిటేటర్ చెప్పవలసిన వివరణ:**

- ప్రాంత అభివృద్ధి కార్యక్రమాలైన సమగ్ర బంజరు భూముల అభివృద్ధి కార్యక్రమం (ఐ.డబ్ల్యు.డి.పి.) కరువు పీడిత ప్రాంతాభివృద్ధి కార్యక్రమం (డి.డబ్ల్యు.ఎం.ఎ.) ఎడారి అభివృద్ధి కార్యక్రమం (డి.డి.పి.) వంటి వాటిల్లో వాటర్‌షెడ్ పథకాలలో గ్రామ ప్రజలను భాగస్తులను చేయడానికి నీటినిల్వ అభివృద్ధి మార్గదర్శక సూత్రాలు ఏప్రిల్ 1995 నుంచి అమలులోకి వచ్చాయి. వీటిని 2001లో వివరించారు. విదానాలను మరింత సరళీకృతం చేయడానికి గ్రామీణ ప్రాంతాల్లోని ఆర్థికాభివృద్ధి కార్యక్రమాల ప్రణాళిక తయారీ, అమలు, నిర్వహణలో పంచాయితీరాజ్ సంస్థలను మరింత అర్థవంతంగా భాగస్వాములను చేయడానికి హరియాలి మార్గదర్శక సూత్రాల పేరుతో ఈ కొత్త మార్గదర్శక సూత్రాలు జారీ అయ్యాయి.
- ప్రాంత అభివృద్ధి కార్యక్రమాల కింద కొత్త పథకాలు హరియాలి మార్గదర్శక సూత్రాలకనుగుణంగా 1.4.2003 నుంచి అమలవుతాయి. డిడబ్ల్యుఎంఎ, డిడిపి కింద గుర్తించిన తాలుకాలలో ఆయా పథకాలు అమలవుతాయి. సాధారణంగా మిగిలిన తాలుకాలలో ఐడబ్ల్యుడిపి పథకాలు అమలవుతాయి.

**గమనిక:** కొంతవరకు హర్యాలి మార్గదర్శక సూత్రాల పరిచయం గురించి పేర్కొనబడింది. ఫెసిలిటేటర్ హరియాలి గురించి సభ్యులకు చెప్పేటప్పుడు బాగా చదివి సహజంగా చెప్పాలి. పుస్తకం చూసి చెప్పకూడదు.

## సెషన్ -4

**విషయం: గ్రామ పంచాయితీ - కమిటీల ఏర్పాటు చేసే పనులు**

**సమయం: 1.30నిమిషాలు**

**పద్ధతి: సభ్యులతో కలిసి చర్చ, 29అంశాలు పరిచయం, బస్సు ఆట**

**కావలసిన మెటీరియల్: ఫ్లాష్‌కార్డులు, మార్కర్లు**

**వివరణ:**

ఫెసిలిటేటర్ సభ్యులకు గ్రామ పంచాయితీ గురించి కొంత చెప్పాలి. సభ్యులను అడుగుతూ అసలు పంచాయితీ అంటే ఏమిటి? వారు చెప్పిన సమాధానాలు బోర్డుపై రాయాలి. వచ్చిన విషయాలను క్రోడీకరిస్తూ చెప్పవలసిన విషయం ఇతరుల ప్రమేయం లేకుండా తమ ఇల్లు తాము చక్కదిద్దుకోవడంలో ఎంతటి సామర్థ్యం, సహనం ఉంటుందో అదేవిధంగా స్థానిక స్వపరిపాలనలో ప్రజలు కూడా బయటి వారి ప్రమేయం తగ్గించుకొని తమంతట తాముగా సమస్యలను పరిష్కరంచుకొనే పక్రియలో గ్రామంలో ఐదుగురి సభ్యులతో అనగా వారు అనుభవజ్ఞులైన ప్రజల కోసం నిస్వార్థంగా పనిచేయగలిగేవారు, ప్రజల సమస్యలను ఓపికతో వినగలిగి పరిష్కారం చేయగలిగిన వారై గ్రామ అభివృద్ధి కోసం కొంత సమయాన్ని కేటాయించి గ్రామ స్వపరిపాలన కోసం పాటుపడాలనే ఉద్దేశంతో అయిదుగురు సభ్యులతో గ్రామ పంచాయితీగా ఏర్పడటం జరిగింది.

గ్రామ పంచాయితీలు సమర్థవంతంగా ఎలాంటి పనులు చేపట్టాలి అనే దానిపై రాజ్యాంగ నిర్దేశాలకు లోబడి, రాష్ట్ర శాసనమండలి స్వయం పాలనా సంస్థలుగా పంచాయితీలు పనిచేయటానికి అవసరమైన అధికారాలను శాసనం ద్వారా కల్పిస్తూ పదకొండవ అను సూచికలో నిర్దిష్ట పరచిన విషయాల్లో పంచాయితీ రాజ్య సంస్థలు పథకాలను రూపొందించుకొని అమలు జరుపుకోటానికి అవకాశం కల్పించాలి. రాజ్యాంగపు పదకొండవ అనుసూచికలో 29 విషయాలలో పంచాయితీ సంస్థలకు అధికారాలున్నాయి.

**పదకొండవ అనుసూచిక:**

1 వ్యవసాయం, వ్యవసాయ విస్తరణ
2 భూమి అభివృద్ధి, భూ సంస్కరణలు అమలు, భూములు ఏకీకరణ, భూసార రక్షణ
3 చిన్న తరహా నీటి పారుదల, నీటి నిర్వహణ, నీటివాలు అభివృద్ధి
4 పశు సంవర్ధన, పాడిపరిశ్రమ, కోళ్ళ పరిశ్రమ
5 మత్స్య పరిశ్రమ
6 సామాజిక అడవులు, చేలల్లో చెట్లు పెంచుట
7 చిల్లర అటవీ ఉత్పత్తులు
8 లఘు పరిశ్రమలు, ఆహార పదార్థాలను శుభ్రపరచుట
9 ఖాదీగ్రామ, కుటీర పరిశ్రమలు
10 గ్రామీణ గృహ నిర్మాణం

11 మంచినీరు

12 ఇంధనం, పశుగ్రాసం

13 రోడ్లు, కల్వర్టులు, వంతెనలు, జలమార్గాలు ఇతర రాకపోకల సాధనాలు

14 గ్రామీణ విద్యుదీకరణ, విద్యుచ్ఛక్తి పంపకం

15 సాంప్రదాయేతర విద్యుచ్ఛక్తి వనరులు

16 పేదరిక నిర్మూలనా కార్యక్రమాలు

17 విద్య, ప్రాథమిక సెకండరీ పాఠశాలలు

18 సాంకేతిక శిక్షణ, వృత్తివిద్య

19 వయోజన, అనియత విద్య

20 గ్రంథాలయాలు

21 సాంస్కృతిక కార్యక్రమాలు

22 మార్కెట్లు సంతలు

23 ఆరోగ్యం, పారిశుధ్యం, ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు చికిత్సాలయంలు

24 కుటుంబ సంక్షేమం

25 స్త్రీ, శిశు అభివృద్ధి

26 సాంఘిక సంక్షేమం, వికలాంగుల, బుద్ధి మాంద్యం కల వారి సంక్షేమం

27 బలహీనవర్గాల, ప్రధానంగా అనుసూచిత వర్గాల అనుసూచిత జాతుల సంక్షేమం

28 ప్రజా పంపిణీ వ్యవస్థ

29 సామాజిక సంపత్తుల నిర్వహణ

గ్రామ పంచాయితీ సమర్ధవంతంగా పనిచేయాలి వారికి వున్న బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలి అంటే అన్ని పనులు గ్రామ పంచాయితీ చేయాలంటే కష్టమౌతుంది కాబట్టి కొన్ని కమిటీలను ఏర్పాటు చేయడం జరిగింది.

**ప్రభుత్వం అయిదు రకాల కమిటీలు ఉండాలని నిర్ణయించింది. అవి:**

1 సహజవనరుల నిర్వహణ కమిటీ

2 మానవ వనరుల అభివృద్ధి కమిటీ

3 ఉపాధి కల్పన, స్వయం సహాయక సంఘాల కమిటీ

4 ఆర్థిక ప్రణాళిక విషయాల కమిటీ

5 పనులు మౌలిక వసతుల కమిటీ

**గమనిక:** పైన పేర్కొనబడిన ఐదు రకాల కమిటీ మెంబర్లు గల నోట్ మాడ్యూల్‌కు జత చేయటం అయింది. ఆ నోట్ చూసి చదివి ఫెసిలిటేటర్ ముందుగానే బసు ఆట ఆడించటానికి సిద్ధం చేసుకోవాలి.

**బస్సుగేమ్ ఆడించే విధానం:**

- మొదటగా ఐదు రకాల కమిటీల గురించి సభ్యులకు వివరించాలి. ముందుగానే ఫ్లాష్‌కార్డులపై కమిటీలు, దానిలోని సభ్యులు: ఎంపిటిసి , వార్డుమెంబర్లు, ఎస్‌హెచ్‌జిలు అలా అన్ని కమిటీల మెంబర్లతో కార్డులు తయారు చేసి పెట్టుకోవాలి.
- గ్రూపు సభ్యులకు అందరికి ఒక్కొక్క కార్డు బ్యాడ్జి పెట్టుకున్నట్లు అతికించాలి. తరువాత సభ్యులందరిని

ఒకే బస్సులో ప్రయాణిస్తున్నాం అనుకొని తిరగమనాలి. తిరుగుతూ వుండగా ఫెసిలిటేటర్ మధ్యలో వుండి ఉదా: ఎన్ఆర్ఎం కమిటీ స్టాఫ్ వచ్చింది ఆ కమిటీలో వున్న సభ్యులందరు దిగండి అని చెప్పాలి. అప్పుడు ఆ కమిటీ సభ్యలందరు ఒక గ్రూపుగా పక్కన నిలబడతారు. అదేవిధంగా మిగిలిన నాలుగు రకాల కమిటీల స్టాపుల పేర్లు చెబుతూ ఐదు రకాల కమిటీలు ఏర్పాటు చెప్పాలి.

- ఐదు రకాల కమిటీల సభ్యులు విడివిడిగా కమిటీ సభ్యులుగా కూర్చుండబెట్టి ఫెసిలిటేటర్ బోర్డుపై ఐదు రకాల కమిటీల పేర్లు అందులోని సభ్యుల ప్రతినిధుల పేర్లు రాయాలి.
- రాయడం పూర్తయిన తరువాత ఒకొక్క కమిటీలో ఎంతమంది సభ్యులు ఉన్నారు అని కమిటీలలో ఏ గ్రూపుల నుండి ప్రతినిధులు ఉన్నారో గమనించి చెప్పాలి.

పైన పేర్కొన్న విధంగా ఐదు రకాల కమిటీల ఏర్పాటు గురించి సభ్యులకు అర్థమయ్యే రీతిలో చెప్పాలి.

**కమిటీలు చేసే పనులు:**

**కార్యాచరణ కమిటీలకు కేటాయించిన అంశాలు**

**1. సహజ వనరుల నిర్వహణ కార్యాచరణ కమిటీ.**

- భూ ఉపరితల, భూగర్భ జలాల సంరక్షణకు చర్యలు తీసుకోవడం. ఉపయోగకరమైన నీరు వ్యర్థ్యంగా కాకుండా, పొర్లిపోకుండా, అరికట్టడం, జాగ్రత్తలు తీసుకోవడం.
- నీటి పథకాలను నిర్వహించడం, మంచినీటి పథకాలు నీటి సరఫరా, గ్రామస్తులు ఉపయోగించుకొనేందుకు వీలుగా పరిశుభ్రంగా వుంచటం.
- చెరువులలో పూడిక తీయించడం.
- అవకాశం, అవసరాలకు అనుగుణంగా చెక్‌డ్యాంలు, ఇంకుడు గుంటల వంటివి నిర్మించి నీటి సంరక్షణ చర్యలు చేపట్టడం
- భూగర్భ జల వనరులు అంతరించి పోకుండా, భూగర్భ జలశాఖ వారి సలహా తీసుకొని బోర్లు తొలిచే ప్రక్రియను గమనించడం.
- తాగునీటి నిలువ భాండము ఎప్పటికప్పుడు శుభ్రంగా వుండేట్లు చూడటం.
- స్థానిక నీటి వనరుల సంరక్షణ కొరకు, భూమి లోతును నివారించడానికి సామాజిక భూములలో పెద్ద ఎత్తున ఆదాయాన్నిచ్చే మొక్కలను నాటించడం పెంచడం.
- సహజ వనరులను సక్రమంగా వాడుకునేట్లు చూడటం. ఇసుక నీటిని భూమిలోకి ఇంకేటట్లు చేస్తుంది. భూమిలో తేమను ఎక్కువ కాలం నిలుపుతుంది. అలాంటి ఇసుకను విచక్షణా రహితంగా వాడుకోవడం, భూగర్భ జల వనరులకు నష్టం. ఈ అంశంపై అవగాహన కల్గించడం.
- చెరువుపై తట్టు భూముల ఆక్రమణను అరికట్టడం.
- స్థానిక గ్రామంలోని చెట్టు చేమలను కాపాడటం.
- ప్రకృతి సమతుల్యతను కాపాడటం. జంతువుల పట్ల ప్రేమను పెంచటం.
- వన సంరక్షణ సమితుల ఏర్పాటు, అటవీశాఖ వారి సహకారంతో రిజర్వ్ అడవులను సంరక్షించటం.
- సామాజిక భూములలో పచ్చిక బయళ్ళను కాపాడటం, అభివృద్ధి చేయటం.
- కాలుష్య రహిత పరిశ్రమలను ప్రోత్సహించటం. నదులు, చెరువులు, కాలువలు, గాలి వంటివి రసాయనాల ద్వారా కలుషితం కాకుండా అరికట్టటం.
- మొక్కల పెంపక కేంద్రం (నర్సరీ) నెలకొల్పటం, నిర్వహించటం, మేలు రకమైన, అభివృద్ధి పరచబడిన

విత్తనాలను నిలువ చేయటం.

- ఎరువుకు ఉపయోగపడే వనరులను సంరక్షించటం, కంపోస్టు ఎరువులు తయారు చేయటం.
- ఆధునిక వ్యవసాయ పద్ధతులను ప్రచారం చేయటం, ఖరీఫ్, రబీ పంటలకు సంబంధించి కార్యాచరణ ప్రణాళికలు తయారు చేయటం.

**2. మానవ వనరుల అభివృద్ధి కార్యాచరణ కమిటీ:**

- చదువు వల్ల ఉపయోగాలను ప్రచారం చేయటం, అక్షర కేంద్రాలను ఏర్పాటు చేయటం, నిర్వహించటం.
- 5-14సంవత్సరాల మధ్య పిల్లలందరు బడిలో నమోదయ్యేటట్లు చర్యలు తీసుకోవటం.
- రోగ నిరోధక టీకాలు, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత వంటి వాటిని పాటించి ప్రజలను చైతన్యవంతులను చేయడం ద్వారా రోగాలు రాకుండా ఆరోగ్యం కాపాడుకోవాలని ప్రచారం చేయటం.
- ఆసుపత్రి - ప్రసవం, పిల్లల ఆరోగ్య సంరక్షణ, చిన్న కుటుంబ పద్ధతులు వంటి కుటుంబ సంక్షేమ ప్రాతిపదికన సందేశాలను ప్రచారం చేయడం.
- గ్రామ స్థాయిలో వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేయటం. జానపద కళలను సజీవంగా వుంచటం.
- యువజన, క్రీడల క్లబ్‌ల వంటి వాటిని నిర్వహించటం.
- ప్రజా సహకార సంఘ పద్ధతులను స్వయం సహాయక కార్యక్రమాలను ప్రోత్సహించటం.
- గ్రంథాలయ / పఠనాలయ నిర్వహణ.
- గ్రామంలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలలో మహిళలు, వెనుకబడిన తరగతుల వారితో సహా అధిక సంఖ్యాకులుగా ప్రజలు పాల్గొనేట్లు చేయటం.
- మత్తు మందులకు, తాగుడుకు బానిసలు కాకుండా నివారించటం.
- మహిళలకున్న ప్రాథమిక హక్కు గురించిన న్యాయ / చట్ట పరిజ్ఞానాన్ని కలిగించటం.
- వైద్య ఆరోగ్య శిబిరాలు నిర్వహించటం.
- అవగాహనా కార్యక్రమాలు నిర్వహించి ప్రజా ప్రతినిధులు మహిళల సామర్థ్యాలను అభివృద్ధి పరచటం.
- గ్రామాలలో వెట్టి చాకిరి, బాల కార్మికులు, జోగిని, దేవదాసి పద్ధతుల వంటి మూఢాచారాలను నిర్మూలించటానికి కృషి చేయటం.
- జీవితంలో అన్ని విషయాలలోను స్వయం సహాయక దృక్పధాన్ని పెంపొందించటం.

**3. ఉపాధి కల్పన, స్వయం సహాయ బృందాల కార్యాచరణ కమిటీ:**

- నిరుద్యోగులు వారి ఉద్యోగ అవసరాలను సేకరించి సమన్వయ పరచటం, సహకరించటం.
- గ్రామంలోని కూలీల జాబితాను నిర్వహించటం.
- వేతనంతో కూడిన ఉపాధి అందుబాటు / స్వయం ఉపాధి కార్యక్రమాలు / పథకాలు, చిన్న వ్యాపారాల గుర్తింపు యువత చేపట్టదగిన స్వయం ఉపాధి అవకాశాల గురించి ప్రజలకు అవగాహన కలిగించటం.
- యువకులలో మార్కెట్ నైపుణ్యాలు, చిన్న చిన్న వ్యాపార సామర్థ్యాలు పెంచే విధంగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించటం.
- గ్రామీణ వృత్తుల వారు ఆధునికమైన పనిముట్లు ఉపయోగించేటట్లు ప్రోత్సహించి ఏర్పాటు చేయటం.
- గ్రామంలో కూలీలకు కనీస వేతనం అమలు జరపటం.
- గ్రామీణ చేతివృత్తులు, కుటీర పరిశ్రమలను గ్రామీణ వృత్తులను ప్రోత్సహించటం. వారి ఉత్పత్తులకు లాభసాటి ధరలు వచ్చేట్లు మార్కెట్ సదుపాయం కల్పించటం.

**4. ఆర్థిక, ప్రణాళిక కార్యాచరణ కమిటీ:**

- పన్ను విధించ తగిన పన్నులేని వనరులను మదింపు చేసి పన్ను విధించటం, వసూలు చేయటం.
- గ్రామ పంచాయితీ విజన్ డాక్యుమెంట్ (భవిష్యత్ ప్రణాళిక) తయారు చేయటం. స్థానిక వనరుల సమీకరణ వాటిని ప్రభుత్వ గ్రాంటులతో అనుసంధాన పరచుకోవటం, వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా అందుబాటులో వున్న నిధులను అంచనా వేసుకోవటం, సంవత్సరానికి, ఐదు సంవత్సరాల కోసం గ్రామ అభివృద్ధి ప్రణాళికలు రూపొందించటం.
- గ్రామానికి కేటాయించిన అన్ని ఆదాయాలు (రెవెన్యూలు), గ్రామ పంచాయితీకి రావాల్సిన గ్రాంట్ ఇన్ ఎయిడ్‌లో సకాలంలో సర్దుబాటు చేయించుకోవటం.
- ప్రజలు ధన, వస్తు శ్రమ రూప విరాళాల ద్వారా అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొనేటట్లుగా ప్రోత్సహించటం.
- గ్రామ పంచాయితీకి సంబంధించిన నెలవారీ / వార్షిక లెక్కలు, బడ్జెట్‌లో తయారు చేసి గ్రామ పంచాయితీకి, గ్రామసభకు, ఉన్నతాధికారులకు సకాలంలో సమర్పించటం.
- లెక్కలు, రిజిస్టరు నిరంతరం సక్రమంగా నిర్వహించేటట్లు చర్యలు తీసుకోవటం.
- ఆడిట్‌కు అవసరమైన రికార్డులను అందించటం, ఆడిట్ సకాలంలో పూర్తి చేయించుకోవటం.
- ఆడిట్ రిపోర్టు మీద వెంటనే స్పందించి తుది జవాబులను వెంటనే ఆడిట్ వారికి పంపి ఆడిట్ అభ్యంతరాలను తొలగించుకోవటం.
- వివిధ కార్యక్రమాలకు నిధులు కేటాయించటం, ఆమోదం కోసం గ్రామసభ ముందుంచటం.
- గ్రామంలో అమలవుతున్న వివిధ పథకాలను, పనులను జాగ్రత్తగా పర్యవేక్షించటం, మూల్యాంకనం చేయటం.

**5. పనులు, మౌలిక వసతుల కార్యాచరణ కమిటీ:**

- గ్రామంలో వున్న భౌతిక వసతులు, ప్రకృతి వనరులు, ఆర్థిక శక్తికి సంబంధించిన గ్రామ సమాచారం సేకరించటం.
- పంచాయితీ భవనం, ఆరోగ్య కేంద్రం, కమ్యూనిటీ హాలు, మార్కెట్ కాంప్లెక్స్, లింక్ రోడ్లు, చెక్‌డ్యాంలు, నీటి పథకాలు వంటి అవసరాల జాబితా తయారు చేయటం, గ్రామసభలో ప్రాధాన్యతలు నిర్ణయించి అవసరమైన పెట్టుబడి అంచనాలు తయారు చేయటం, స్థానిక వనరులను సమీకరించటం, వాటిని ప్రస్తుతం గ్రామానికి వున్న గ్రాంటులతో అనుసంధాన పర్చుకోవటం, మొత్తం ఆదాయాలను అంచనా వేసుకోవటం.
- స్థానిక అభివృద్ధికి అనుగుణంగా ప్రజల అవసరాలను గుర్తించటంలోను ప్రాధాన్యతలను నిర్ణయించుకోవటంలోను సహాయ పడటం. మండల, జిల్లా స్థాయిలోని సాంకేతిక నిపుణుల సహకారంతో అవకాశం వున్న పథకాలను తయారు చేయటం.
- సౌకర్యాల / వసతుల అభివృద్ధి కోసం గ్రామ పంచాయితీ బడ్జెట్‌ను దృష్టిలో వుంచుకొని వార్షిక ప్రణాళికలు రూపొందించటం.
- గ్రామ స్థాయిలో అమలయ్యే వివిధ శాఖల ప్రణాళికలు కార్యక్రమాలు, పథకాల మధ్య సమన్వయాన్ని సాధించి, ఆర్థిక భారాన్ని తగ్గించుకొని, ఆశించిన ఫలితాలను సాధించటానికి చర్యలు తీసుకోవటం.
- గ్రామ అభివృద్ధి కార్యక్రమాలలో స్థానిక స్వచ్ఛంద సంస్థలను, విదేశాలలో నివసిస్తున్న గ్రామస్తులను, ఇతర ట్రస్టులను పాల్గొనేటట్లు చేయటం. పంచాయితీ కార్యక్రమాలకు వారి సహకారం కోరటం.

## సెషన్ - 5

**విషయం: సహజ వనరుల కమిటీ బాధ్యతలు**

**పద్ధతి: లెక్చర్**

**సమయం: 45 నిమిషాలు**

**కావలసిన మెటీరియల్: బాధ్యతల బ్రోచర్స్**

**వివరణ: ఫెసిలిటేటర్ సహజ వనరుల కమిటీ చేయాల్సిన పనులు, బాధ్యతలు ఒకొక్క దానిపై వివరణ ఇస్తూ అర్ధమయ్యే రీతిలో చెప్పాలి.**

### 1. సహజ వనరుల నిర్వహణ కార్యాచరణ కమిటీ.

- ఉపరితల, భూగర్భ జలాల సంరక్షణ. ఉపయోగకరమైన నీరు వ్యర్ధ్యం కాకుండా జాగ్రత్తలు తీసుకోవడం.
- నీటి పథకాల నిర్వహణ, మంచినీటి పథకాలు నీటి సరఫరా.
- చెరువులలో పూడిక తీయించడం.
- నీటి సంరక్షణ చర్యలు
- భూగర్భ జల వనరులు అంతరించి పోకుండా బోర్లు తొలిచే ప్రక్రియను గమనించడం.
- మంచినీటి ట్యాంకు ఎప్పటికప్పుడు శుభ్రంగా వుండేట్లు చూడటం.
- స్థానిక నీటి వనరుల సంరక్షణకు, భూమి కోతను నివారించడానికి సామాజిక భూములలో పెద్ద ఎత్తున ఆదాయాన్నిచ్చే మొక్కలు నాటించడం.
- సహజ వనరులను సక్రమంగా వాడుకునేట్లు చూడటం.
- చెరువు శికం భూముల ఆక్రమణను అరికట్టడం.
- గ్రామంలోని చెట్టు చేమలను కాపాడటం.
- ప్రకృతి సమతౌల్యాన్ని కాపాడటం. జంతువుల పట్ల ప్రేమను పెంచటం.
- వన సంరక్షణ సమితుల ఏర్పాటు, అటవీశాఖ వారి సహకారంతో రిజర్వ్ అడవులను సంరక్షించటం.
- సామాజిక భూములలో పచ్చిక బయళ్ళను కాపాడటం, అభివృద్ధి చేయటం.
- కాలుష్య రహిత పరిశ్రమలను ప్రోత్సహించటం. నదులు, చెరువులు, కాలువలు, గాలి వంటివి రసాయనాల ద్వారా కలుషితం కాకుండా అరికట్టటం.
- మొక్కల నర్సరీ నెలకొల్పటం, అభివృద్ధి పరచిన విత్తనాలను నిలవ చేయటం.
- ఎరువుకు ఉపయోగపడే వనరులను సంరక్షించటం, కంపోస్టు ఎరువులు తయారు చేయటం.
- ఆధునిక వ్యవసాయ పద్ధతులను ప్రచారం చేయటం, ఖరీఫ్, రబీ పంటలకు సంబంధించి కార్యాచరణ ప్రణాళికలు తయారు చేయటం.

## సెషన్ -6

**ఉద్దేశం: వాటర్‌షెడ్ కార్యక్రమాల ఉద్దేశాలు తెలుసుకుంటారు**

**విషయం: సహజ వనరుల సమస్యల గుర్తింపు, విశ్లేషణ**

**సమయం: రెండుగంటలు**

**పద్ధతి: సమస్యావృక్షం విశ్లేషణ**

**కావలసిన మెటీరియల్: బ్రౌన్‌షీట్లు, మార్కర్లు, అవకాశాలు, ఆలోచనల బ్రోచర్**

**వివరణ:**

**సమస్యా వృక్షాన్ని విశ్లేషణ చేసే పద్ధతి:**

మొదటగా గ్రామంలోని సహజ వనరుల సమస్యలను గుర్తించాలి. సభ్యులను చిన్న గ్రూపులుగా చేసి ఒక్కొక్క గ్రూపుకు ఒక సమస్య ఇచ్చి ఆ సమస్యకు కారణలేమిటి అన్న విషయాన్ని ఒక చెట్టు రూపంలో విశ్లేషణ చేయమని చెప్పాలి.

**ఫెసిలిటేటర్‌కు సూచనలు:**

1. సమస్యా వృక్షం విశ్లేషణ పద్ధతిని ఫెసిలిటేటర్ ముందుగా చేసి చూపాలి.
2. చెట్టు రూపంలో ఎందుకు చేసామన్న ఉద్దేశాన్ని వివరించాలి. దానిలో సమస్యని కాండంతోటి ముఖ్య కారణాలను చెట్టు వేళ్ళతోటి, ప్రభావాలను కొమ్మలుగా అనుకొని విశ్లేషణ చేయమనాలి.
3. గ్రూపు ప్రజేంటేషన్ అయిన తరువాత కారణాలకు, ప్రభావాలకు లింక్ చేస్తూ వివరణ ఇవ్వాలి.

## సెషన్ -7

**విషయం: ఏరువాక చిత్రం**

**ఉద్దేశం: యుజిల ఏర్పాటు తెలుసుకుంటారు**

**సమయం: 1గంట**

**పద్ధతి: టివి ద్వారా, ప్లీనరి చర్చ**

**కావలసిన మెటీరియల్: టివి, ఏరువాక సిడి**

**వివరణ:** సభ్యులందరికి సిడి చూపించి చూసేటప్పుడు ఏమి తెలుసుకున్నారో గమనించమని చెప్పాలి. చిత్రం చూసిన తరువాత దానిపై రివ్యూ పెట్టాలి. వారు చెబుతున్న విషయాలన్ని బోర్డుపై రాయాలి. ఈ విషయాలను తరువాత సెషన్‌కు లింక్ చేసి ముగించాలి.

## సెషన్ - 8

**విషయం:** **వాటర్‌షెడ్ లో బృందాలు**

**ఉద్దేశం: వాటర్‌షెడ్‌లో బృందాల ప్రాధాన్యం గురించి, సంస్థాగత ఏర్పాట్లపై అవగాహన కల్గ చేయడం**

**పద్ధతి: బృందంలో చర్చ, కేస్ స్టడీని విశ్లేషించడం, బొమ్మలు వేయడం (విజువలైజేషన్)**

**వివరణ:**

సభ్యులను 3 లేక 4 గ్రూపులుగా విభజించాలి. ప్రతి గ్రూప్ సభ్యులకు నందిపేట కధని ఇచ్చి అందులో విషయాలని చర్చించి వాటికి బొమ్మలు వేయమని ప్రతి బృందాన్ని కోరాలి. తద్వారా, గ్రామంలో వనరులు, సమస్యలు, పరిస్థితులపై అవగాహన కలుగుతుంది.

ఈ. కావలసిన వస్తువులు: చార్టులు, రంగురంగుల స్కెచ్ పెన్నులు, థర్మాకోల్, జిగురు వగైరా

రీడింగ్ మెటేరియల్: నందిపేట కేస్ స్టడీ జిరాక్సులు, కరువు నుంచి కలిమికి

**ముఖ్య ప్రశ్నలు:**

1. వాటర్‌షెడ్‌లో ఏ వనరులు ఉన్నాయి? ఏ వనరులపై ఎవరు ఆధారపడ్డారు?
2. వినియోగదారుల బృందాలు/ స్వయం సహాయక బృందాలు అంటేఏమిటి?

**జవాబులు:**

1. భూమి, అడవి, నీరు ( నదులు, చెరువులు), జంతువులు, మనుషులు వగైరాలు వాటర్‌షెడ్‌లో వనరులు
2. ఈ వనరులపై ప్రత్యక్షంగా ఆధారపడ్డవారితో ఏర్పాటైన బృందాలను వినియోగదారుల బృందాలని, పరోక్షంగా ఆధారపడ్డ వారిని స్వయం సహాయక బృందాలని అంటారు.
3. అన్ని గ్రూపులు సభ్యులతో కూడిన సంఘం వాటర్‌షెడ్ అసోసియేషన్ అవుతుంది. స్వయం సహాయక బృందాలు, వినియోగదారుల బృందాల ప్రతినిధులు, గ్రామ పంచాయితి ప్రతినిధి, వాటర్‌షెడ్ అభివృద్ధి బృందం ప్రతినిధులతో కలసి వాటర్‌షెడ్ కమిటీ ఏర్పాటవుతుంది.

**సమయం: 1..30 గంటలు**

**ఫెసిలిటేటర్‌కి సూచనలు:**

1. చర్చలలో గ్రూపుల నిర్వచనాలపై చాలా వివాదం జరిగే అవకాశం ఉంది. ఓపికతో చర్చలకు సారధ్యం వహించాలి. విసుక్కోరాదు. వాదోపవాదాలను జాగ్రత్తగా విశ్లేషించాలి.
2. గ్రూపుల ఆవశ్యకతపై, నిర్మాణ ప్రక్రియపై సైద్ధాంతిక స్పష్టత కోసం ఫెసిలిటేటర్ సంబంధిత పుస్తకాలను చదవాలి.

## సెషన్ - 9

**విషయం: వాటర్‌షెడ్‌లో ప్రకియలు, దశలు**

**ఉద్దేశం: నీటినిల్వ కార్యక్రమ దశలు గురించి తెలుసుకుంటారు**

**పద్ధతి: జంబుల్ గేమ్**

**సమయం: 1.30 నిమిషాలు**

**కావలసిన వస్తువులు: దశలు, సంఘటనలు రాసిన కార్డులు ( 4 సెట్స్), జిగురు/ టేప్, చార్టు**

**రీడింగ్ మెటీరియల్: విజయానికి మెట్లు అనే బ్రోచరు**

**వివరణ:**

వాటర్‌షెడ్‌లో ముఖ్యమైన దశలు, సంఘటనలు విడివిడిగా కార్డులపై రాయాలి. ఈ కార్డులన్నీ కలిపి ఒక కవర్‌లో ఉంచాలి. ఈ రకంగా 3 లేక 4 కవర్ లని / సెట్స్‌ని తయారు చేయాలి. శిక్షణార్థులను గ్రూపులుగా విభజించి, ఒక్కొక్క బృందానికి ఒక్కొక్క కవరు ఇవ్వాలి. ఆ బృంద సభ్యులు ఆ కార్డులను చర్చించి దశల వారీగా, సంఘటనల వారీగా అమర్చాలి. చర్చల ద్వారా గ్రూపులో ఏది ముందు, ఏది తర్వాత అన్న విషయంపై అవగాహన కలుగుతుంది. అలా అమర్చిన తర్వాత, ప్రతి గ్రూపు వారి నివేదికని సమర్పించాలి.

**ముఖ్య ప్రశ్నలు:**

1. వాటర్‌షెడ్‌లో ఉన్న సంఘటనలు, దశలు ఏమిటి?
2. వాటి క్రమం ఏమిటి?

**జవాబులు:**

1. ముఖ్యమైన దశలు 5
   ప్రారంభదశ, సంఘటిత దశ, ప్రణాళిక దశ, ఆచరణ దశ మరియు మూల్యాంకన దశ
2 వాటి క్రమం గురించి రీడింగు మెటీరియల్‌లో ఉంది.

**సమయం: 1.30 నిమిషాలు**

**ఫెసిలిటేటర్‌కి సూచనలు:**

1 ప్రతి గ్రూపు వాటర్‌షెడ్ అమలు తీరు సంఘటనలు, దశల క్రమాన్ని తమకు తోచిన విధంగా పెడతాయి. ఒక గ్రూపు వారు చేసినదే ఒప్పు, మిగతావారిది తప్పు అనవలసిన అవసరం లేదు

2. అమలు తీరును అమర్చిన క్రమం గురించి బృందాల మధ్య చర్చకు వీలు కల్పిస్తూ ఆయా క్రమాల్లోని హేతుబద్ధతపై అవగాహన పెరిగే విధంగా ఫెసిలిటేటర్ ప్రవర్తించాలి.

## సెషన్ -10

**విషయం: వాటర్‌షెడ్‌లో ప్రాధాన్యతలు**

**ఉద్దేశం : వాటర్‌షెడ్‌లో ఎవరికి ప్రాధాన్యతలు అనే దాని గురించి తెలుసుకోవాలి**

**సమయం: 1గంట**

**కావలసిన మెటీరియల్: సిడి సెట్స్ 5, బ్రౌన్‌షీట్స్, మార్కర్స్,వాటర్‌షెడ్‌లో ప్రాధాన్యతలు బ్రోచర్**

**వివరణ:**

పోస్టర్స్‌తో గ్రూపు చర్చలు నిర్వహించాలి. పోస్టర్స్‌లో ఉన్న ప్రశ్నలకు సమాదానం చెప్పి, వాటినుండి నియమాలు, ప్రాధాన్యతలు ఆలోచించాలి. చర్చకు గాను ఒక్కొక్క గ్రూపుకు 20 నిమిషాలు సమయం కేటాయించవచ్చు. పోస్టర్స్‌లోని ప్రశ్నలకు సమాదానాలు రాసి, తమ తమ ప్రాదాన్యతలను మిగతా గ్రూపులతో పంచుకోవాలి.

**మెటేరియల్:పోస్టర్స్ (ఫెసిలిటేటర్‌కు) ప్రాధాన్యతలను వివరించే బ్రోచర్**

కీలక ప్రశ్నలు :

1. వాటర్‌షెడ్‌లో ప్రధాన్యతలేమిటి?
2. వాటర్‌షెడ్ కార్యక్రమానికి సంబందించి నియమాలేమిటి?

**సమాధానాలు:**

1 మహిళలకు, పేదలకు అనుగుణమైన కార్యక్రమాలు రూపొందించడం, ఉమ్మడి వనరులకు ప్రాదాన్యం, సామూహికంగా, ఎక్కువ ముందే లాభం కలిగించే పనులకు ప్రాదాన్యమివ్వడం

2. ప్రణాళికలు ప్రజలే చేయాలి, నిర్ణయాధికారం ప్రజలదే, జీవనోపాది పెంపొందించే కార్యక్రమాల అమలు, చేపట్టిన పనులు కలకాలం నిలిచే వ్యవస్త రూపొందించుకోవాలి.

**ఫెసిలిటేటర్‌కు సలహాలు:**

1. గ్రామంలో ఎన్నొ సమస్యలున్నా, పేదలకు మహిలలకు సంబంధించిన సమస్యలకు ప్రాధాన్యం పెంచే విధంగా ఫెసిలిటేట్ చేయాలి.

## సెషన్ - 11

**విషయం: హరియాలి ప్రకారం వాటర్‌షెడ్ కార్యక్రమంలో జిపి పాత్ర**

**ఉద్దేశం: వనరుల నిర్వహణ గ్రామ పంచాయితీ పాత్రపై అవగాహన**

**సమయం: 1గంట**

**పద్ధతి : అందినంత తీసుకో**

**కావలసిన మెటీరియల్ : చిన్న రాళ్ళు 300 దాకా, వనరులుంటేనే మనం బ్రోచర్**

**ఆట వివరణ :**

ప్రకృతి వనరుల అభివృద్ధి, వినియోగం, నిర్వహణలో సంఘం పాత్రను నియాలు, కట్టుబాట్లు

ఆవశ్యకతనూ, నియమాలు పాటించే విధానానికి కావలసిన ఏర్పాట్ల గురించి తెలియచేసే సందర్భంలో ఈ ఆటను ఆడించాలి.

**ఈ ఆట ద్వారా ఇచ్చే సందేశం / నేర్చుకునే అంశాలు:**

❄ వ్యక్తిగత స్వార్థం వల్ల, వనరుల వినియోగం సుస్థిరంగా, అందరికీ అందుబాటులో ఉండే విధంగా జరగదు.

❄ సంఘంలో కట్టుబాట్లు, నియమాల వల్ల ఈ వనరుల వినియోగాన్ని అందరికీ అందుబాటులోకి తెచ్చి సుస్థిరంగా ఉపయోగించవచ్చును.

❄ నియమాలను భంగపరచిన సమయంలో సంఘాలు ఏం చేయాలి? నాయకత్వ లక్షణాలు ఏమిటి? అన్న విషయంపై అవగాహన.

**ఆడవలసిన విధానం:**

- ఫెసిలిటేటర్ శిక్షణార్థులందరినీ బయటికి వెళ్ళి, గుప్పెళ్ళలో చిన్న చిన్న కంకరరాళ్ళు తెమ్మని చెప్పాలి. వారు తెచ్చిన రాళ్ళన్నీ ఫెసిలిటేటర్ తన దగ్గర పెట్టమని చెప్పాలి.
- ఫెసిలిటేటర్ ఈ ఆటని ప్రారంభించే ముందు శిక్షణార్థుల నుండి ఎవరైనా ముగ్గురిని రమ్మని పిలవాలి. తన దగ్గర వున్న రాళ్ళలో ఇంచుమించు 20 శాతం రాళ్ళని వాళ్ళ మధ్యలో నేలమీద ఉంచి, వాళ్ళని "అందినంత తీసుకోమ్మని" చెప్పాలి. వారు తీసుకోగా మిగిలిన రాళ్ళకి సమానమైన రాళ్ళని తాను మళ్ళీ ఇస్తానని ముందే ఫెసిలిటేటర్ వాళ్ళకి చెప్పాలి.
- వచ్చిన ముగ్గురు, తమకు తోచిన విధంగా అందినన్ని రాళ్ళని తీసుకొని వెళతారు. మిగిలిన రాళ్ళకి, సమానమైన రాళ్ళని ఫెసిలిటేటర్ మళ్ళీ మధ్యలో ఉంచాలి. ఈ విధంగా మొదటి పట్టు జరిగాక, ఫెసిలిటేటర్ ఆ ముగ్గుర్ని మళ్ళీ రెండో పట్టు కూడా తీసుకోమ్మని చెప్పాలి. రెండో పట్టు ఆడాక, మిగిలిన రాళ్ళకి సమానమైన రాళ్ళని తాను మళ్ళీ కలవాలి.
- ఈ విధంగా ఆ ముగ్గురు మధ్యలో ఉన్న రాళ్ళని పూర్తిగా ఖాళీ చేసేంతవరకు ఆడాలి.
- ఈ ఆట జరిగినంత సేపూ మిగతా వారిని గమనించమని చెప్పాలి. మొదటి దశలో ఆడిన ముగ్గురూ, ఎన్ని పట్టు ఆడారు, ఒక్కొక్కరు ఎన్ని తీసుకున్నారు - అన్న విషయాన్ని కో ఫెసిలిటేటర్ బోర్డు మీద రాయాలి.
- రెండో దశలో ఫెసిలిటేటర్ ఇంకో ముగ్గురిని ఆహ్వానించాలి. అదే ఆట ఆడాలి అని చెప్పాలి. అయితే ఈ సారి ఒక నిబంధన నియం ఉంచాలి. ముందు దశలో ఎన్ని పట్లు ఆడారో, ఈ దశలో కనీసం అంతకు రెట్టింపు పట్టు ఆడాలి అని చెప్పాలి. అయితే అది ఎలా సాధ్యపడుతుందో తేల్చుకొమ్మని, ఆ ముగ్గురినీ బయటకు పోయి చర్చించుకురమ్మని చెప్పాలి.
- వారు చర్చించుకుని వచ్చిన తర్వాత రెండో దశలో ఆట మొదలుపెట్టాలి. ముందు దశకన్నా ఈ దశలో శిక్షణార్థులు కొంచెం జాగ్రత్తగా ఆడటం వల్ల ఎక్కువ పట్టు ఆడగలరు. ఎప్పటిరాగానే ఫెసిలిటేటర్ మిగిలిన రాళ్ళకి సమానమైన రాళ్ళను తన దగ్గర వున్న రాళ్ళ నుండి మధ్యలో ఉంచాలి (ప్రతి పట్టు చివరలో)
- కో ఫెసిలిటేటర్ ఈ దశలో జరిగిన విధానాన్ని (ఎవరు, ఏ పట్టులో, ఎన్ని రాళ్ళు తీసుకున్నదీ) వివరంగా బోర్డు మీద రాయాలి.
- మూడవ దశకి ముందు ఆ ముగ్గురు శిక్షణార్థులలో ఒకరికి మీరు పెట్టుకున్న నియమాలని భంగపరచు అని ఫెసిలిటేటర్ రహస్యంగా సూచనలు ఇవ్వాలి. కో ఫెసిలిటేటర్ -మిగిలిన ఇద్దరికీ "పరిస్థితులు మారితే,

ఏం చేస్తారో -ఆలోచించండి తగిన చర్య తీసుకోండి అని రహస్యంగా సలహా ఇవ్వాలి.

- మూడో దశలో అదే ఆట ఆడాలి ఈ ముగ్గురు శిక్షణార్థులు. అయితే ఈ దశలో ఆ ముగ్గురిలో ఒకరు నియమాలని భంగపరచడం వల్ల ముందు మొదటి దశలో ఆడిన విధంగానే రాళ్ళన్నీ త్వరగా అయిపోతాయి. మిగతా ఇద్దరూ వారికి తోచిన విధంగా ప్రవర్తిస్తారు. (కోపగించుకోవడం, దెబ్బలాడటం, బాధపడటం, ప్రాధేయపడటం, వగైరా)
- ఈ దశలో కూడా ఎవరు ఎన్ని రాళ్ళు, ఏ పట్టులో తీసుకున్నదో కోఫెసిలిటేటర్ రాయాలి.
- చివరిగా, ఫెసిలిటేటర్ - ఏ దశలో ఆడిన వారిని, వారి ఆలోచనలను, ప్రవర్తనని విశ్లేషించేలా ప్రశ్నలు వేయాలి.
- మీరు ఏమనుకున్నారు?
- ఎందుకు, ఇన్ని రాళ్ళు తీసుకున్నారు?
    - ఇంకొకరిని చూసి మీకు ఏమనిపించింది?
    - దానికి కారణం ఏమిటి?
    - ముందు దశకి, తర్వాత దశకి తేడా ఏమిటి?
    - ఏ విషయంలో మార్పులు వచ్చాయి? ఎందుకు?
    - బయట ఉండి ఆడని వారు ఏమనుకున్నారు?
- ఈ ప్రశ్నలకి సమాధానాలుగా అందరూ వనరుల వినియోగంలో నియమాల అవసరాన్ని ఆ నియమాలు భంగపరిస్తే ఏం చేయాలి? వగైరాలను గుర్తించి వివరంగా చర్చిస్తారు. ఆ రాళ్ళనే ప్రకృతి వనరులైన నీరు, భూమి, చెట్లుగా గుర్తించి వాటి యాజమాన్యంలో కావలసిన వ్యవస్థాగత ఏర్పాట్లను, అందులో వ్యక్తుల పాత్రను, నాయకత్వ లక్షణాలను గుర్తించే విధంగా చర్చ జరపాలి.

**ఫెసిలిటేటర్‌కి సూచనలు:**

- తన దగ్గర ఎక్కువ శాతం (80శాతం) రాళ్ళను మధ్యలో తక్కువ శాతం (10శాతం) రాళ్ళను ఉంచాలి.
- మొదటి దశలో ఫెసిలిటేటర్ టీంలో నుండి ఒకరు ఉంటే ఆట రసాభాసా కాకుండా ఆడే అవకాశం ఉంటుంది. ఒక్కొక్కసారి మొదటి దశలోనే కొందరు సామాన్యంగా ప్రవర్తించే విధానానికి భిన్నంగా ప్రవర్తిస్తే ఈ ఫెసిలిటేటర్ టీం సభ్యులు తగిన విధంగా ప్రవర్తించి ఆటలో సందేశాన్ని అందించేదానికి సహాయపడవచ్చు.
- ఆఖరిగా ఫెసిలిటేటర్ గ్రూపు సభ్యులందరికి మార్గం చూసుకో/వనరులు కాపాడుకో అనే బ్రోచర్ ఇచ్చి అందరితో చదివించి అందరికి అర్థమయిందో లేదో ఒకసారి రివ్యూ చేసి ఈ సెషన్‌ను ముగించాలి.

# సెషన్ -12

**విషయం: వ్యక్తులు, బాధ్యతలు**

**ఉద్దేశం: నీటినిల్వ కార్యక్రమంలో వ్యక్తులు బాధ్యతలు గురించి తెలుసుకుంటారు**

**సమయం: 1గంట**

**పద్ధతి: భాగస్వామ్య చర్చ, ఫ్లాష్‌కార్డులు ఉపయోగించి**

**కావలసిన మెటీరియల్: బాధ్యతలు కలిగిన ఫ్లాష్‌కార్డులు**

**వివరణ: ఫెసిలిటేటర్  నీటినిల్వ అమలులో ఎవరెవరు వ్యక్తులు వుంటారు వివరించాలి**

**గ్రామ పంచాయితీ బాధ్యతలు:**

- గ్రామసభ / గ్రామ పంచాయితీ నేరుగా ఒక బ్యాంకు ఖాతా తెరవాలి
- గ్రామ సభ సంవత్సరంలో కనీసం రెండుసార్లు సమావేశం ఏర్పాటు చేయాలి
- వాటర్‌షెడ్ అభివృద్ధి ప్రణాళికను ఆమోదించడంలో మెరుగుపరచటం
- ప్రగతి పర్యవేక్షించి సమీక్షించటం
- జమాఖర్చు లెక్కలను ఆమోదించటం
- స్వయం సహాయక, వినియోగదారుల బృందాలను ఏర్పాటు చేయటం
- బృందాల మధ్య వచ్చే వివాదాలు / తగాదాలను పరిష్కరించటం
- గ్రామ ప్రజలు / వ్యక్తుల నుంచి స్వచ్ఛంద విరాళాలు, తమవంతు వాటా చెల్లింపులకు చేసిన ఏర్పాట్లను ఆమోదించటం
- సృష్టించిన ఆస్తుల నిర్వహణ, మరమ్మతులకు సంబంధించిన విధానాలు రూపొందించటం
- వాటర్‌షెడ్ అభివృద్ధి నిధిని ఉపయోగించి చేపట్టే పనులను ఆమోదించటం

**సహజ వనరుల కమిటీ**

- రోజువారీ పనులను నిర్వహిస్తుంది
- పథకం సాఫీగా అమలు కావటానికి వాటర్‌షెడ్ అభివృద్ధి బృందంలోనూ, ప్రాజెక్టు అమలు చేసే సంస్థ సమన్వయం పరచడం
- వాటర్‌షెడ్ అభివృద్ధి పనులు అమలు చేయడం, వాటికి చెల్లింపులు చేయటం

**స్వయం సహాయక బృందాల బాధ్యతలు**

- స్వయం సహాయక గ్రూపుల సమావేశం కనీసం నెలకొకసారి జరపాలి
- జమాఖర్చుల లెక్కలు ఎప్పటికప్పుడు రాస్తూ ఉండాలి
- ఇచ్చిన రుణాలలో ఇంచుమించు 80శాతం కాలపరిమితి లోపే వసూలు చేసుకుంటూ వుండాలి
- ఆర్థిక వనరులలో ఇంచుమించు 50శాతం సభ్యుల ద్వారా సమకూర్చుకుని వ్యాపారం నిర్వహించుకోవాలి
- స్వయం సహాయక కార్యక్రమాలు చేపట్టి నిర్వహించుకోవాలి.
- వాటర్‌షెడ్ కార్యాచరణ ప్రణాళిక తయారీలో ఎస్‌హెచ్‌జిలు పాల్గొని తాము చేయు కార్యక్రమాలు పొందుపరచగలగాలి.
- ఒక లక్ష రూపాయలకు మించని మొత్తంతో రివాల్వింగ్ నిధిని పంచాయితీ ఏర్పాటు చేస్తుంది
- ఈ నిధిని ఆదాయం సమకూర్చే పనులు చేపట్టడానికి ఒక్కొక్క స్వయం సహాయక బృందానికి 10వేలు రూపాయలు  మించకుండా అప్పుగా తీసుకోవచ్చు
- ఈ అప్పు ఆరు నెలల వాయిదాలలోపు చెల్లించాలి
- ఆ మొత్తాన్ని తిరిగి వేరే స్వయం సహాయక బృందాలుగా అప్పుగా ఇచ్చారు.
- అన్ని స్వయం  సహాయక బృందాల మధ్య  ఈ నిధి రివాల్వి అవుతూ ఉండాలి.

**గ్రామ కార్యదర్శి బాధ్యతలు**

- ❖ గ్రామ పంచాయితీ, గ్రామసభ సమావేశాలను ఏర్పాటు చేసి వాటి నిర్ణయాలు అమలు చేయాలి
- ❖ పథకానికి సంబంధించిన అన్ని రికార్డులను, జమాఖర్చు లెక్కలను నిర్వహించాలి
- ❖ వాటర్‌షెడ్ పథకం కార్యాచరణ ప్రణాళిక ప్రకారం పనులు అమలు చేయడంలో కార్యదర్శికి సహాయం అవసరమైతే అందులో 2 లేదా 3 వాలంటీర్లను గ్రామ పంచాయితీ నియమించవచ్చు.

**ప్రాజెక్టు అమలు చేసే సంస్థ బాధ్యతలు**

1 భాగస్వామ్య గ్రామీణ అంచనా (పిఆర్ఏ) ద్వారా వాటర్‌షెడ్ అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయడంలో గ్రామ పంచాయితీలకు అవసరమైన సాంకేతిక సహాయం అందించటం

2 ప్రజలను సంఘటిత పర్చటం

3 గ్రామ ప్రజలకు శిక్షణ నివ్వటం

4 వాటర్‌షెడ్ అభివృద్ధి పనులను పర్యవేక్షించటం

5 పథకానికి సంబంధించి జమాఖర్చు లెక్కలను తనిఖీ చేసి ధృవీకరించడం

6 తక్కువ ఖర్చు సాంకేతిక విజ్ఞానాన్ని అవలంభించేలా ప్రోత్సహించటం

7 స్థానిక సాంకేతిక విజ్ఞానాన్ని బలోపేతం చేయటం

8 పథక అమలును సమగ్రంగా పర్యవేక్షించి సమీక్షించటం,

9 సృష్టించిన ఆస్తులను మరింతగా అభివృద్ధి పర్చడానికీ పథకం ముగిసిన తరువాత వాటి నిర్వహణ, మరమ్మతులకు వ్యవస్థాగత ఏర్పాట్లు చేయటం

10 ప్రాజెక్టు అమలు చేసే సంస్థ పర్యవేక్షణ మార్గదర్శకత్వంలో గ్రామ పంచాయితీలు పథకాలు అమలు చేస్తాయి.

**వినియోగదారుల బృందాల బాద్యతలు:**

1. వాటర్‌షెడ్ ప్రజలలో ఇంచుమించు 50 శాతం కనీసం ఒక వినియోగదారుల బృందంలో సభ్యత్వం కలిగి ఉండాలి.
2. వాటర్‌షెడ్ పనులు, కార్యక్రమాలలో ఇంచుమించు 80 శాతం సంబంధిత వినియోగదారుల బృందాలు స్వయంగా అమలు చేసి ఉండాలి.
3. నెలకు కనీసం ఒకసారి క్రమ తప్పకుండా సమావేశం అవుతూ, సభ్యుల ఏకాభిప్రాయం ద్వారా నిర్ణయాలు తీసుకుంటూ ఉండాలి.
4. తమకు సంబంధించిన పనులకు అయిన ఖర్చులలో నిర్దేశిత సూత్రాల ప్రకారం చెల్లించాల్సిన వాటాను నగదు రూపంలో కాని శ్రమ, వస్తు రూపంలో కాని ఐచ్ఛికంగా ఇంచుమించు 80 శాతం సభ్యులు ఇచ్చి ఉండాలి.

**ఫెసిలిటేటర్ బాద్యతలు నిర్వహకుడు బాధ్యతలు:**

1. స్వయం సహాయక సంఘాలు, వినియోగదారుల బృందాలు పంచాయితీ మధ్య సమన్వయ కర్తగా వ్యవహరించడం.
2. గ్రూపుల వారీగా వివరాలు అందరికి తెలియ చేయడం

3. ప్రతి గ్రూపులోనూ, ఆ గ్రూపు యొక్క మొత్తం సభ్యులతో సమావేశం ఏర్పాటు చేయడం
4. వినియోగదారుల బృందాలకు కార్యాచరణ ప్రణాళిక తయారు చేయడంలో సహాయపడటం
6. స్వయం సహాయక బృందాలను సమావేశపరచి వారి సమస్యలువారే చర్చించుకుని పరిష్కరించుకొనేటట్లు చేయడం పొదుపు ప్రోత్సాహించడం
7. డ్వాక్రా గ్రూపులను బలోపేతంగా చేయడం
8. మహిళలకు, భూమి లేని వారికి ఎస్.సి. మరియు ఎస్.టి లకు సహాయం అందేలా చూడడం
9. అన్నిసమావేశాలలో అందరు సభ్యులు పాల్గొనేలా చర్యలు తీసుకోవడం
10. కార్యాచరణ ప్రణాళిక ప్రకారంగా పనులు అమలు జరిగేలా చేయడం
11. వాటర్‌షెడ్ పనులు, కొలతలు, లెక్కలు, తనిఖీ చేయడం
12. వారంతర ప్రగతి రిపోర్టును పి.ఐ.ఏ. కి సమర్పించడం

**ముగింపు**

**విషయం: సమీకరణ, ఫీడ్‌బ్యాక్**

**కార్యక్రమాన్ని సమీకరణ చేసి సభ్యులందరి దగ్గరి ఫీడ్‌బ్యాక్ తీసుకొని కార్యక్రమాన్ని ముగించాలి.**

- - -